# సాక్షి
## అన్నమయ్య జిల్లా

ఆదివారం । 23 । జూలై । 2023






### రక్తమోడిన రహదారి

కడప- రేణిగుంట జాతీయ రహదారి 716 రక్తమోడింది.ఆర్టీసీ బస్సును సిమెంటు ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొనడంతో ఐదుగురు మృతి చెందారు. -8లో..



### లోక్ అదాలత్‌లో 52 కేసుల పరిష్కారం

కడపలో నిర్వహించిన లోక్ అదాలత్‌లో 52 కేసులు పరిష్కరించారు. కక్షిదారులకు నష్టపరిహారంగా చెల్లించారు. -8లో..

మదనపల్లె : టమాటా ధరలు (10 కిలోలు)

| | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| మొదటిరకం | రూ.1080 | రూ.1200 |
| రెండోరకం | రూ.940 | రూ.1060 |

మార్కెట్‌కు వచ్చిన మొత్తం సరుకు : 566 మెట్రిక్ టన్నులు



పట్టుగూళ్ల ధరలు (రూ.లో)

| రకం | కనిష్టం | గరిష్టం |
|---|---|---|
| బైవోల్టిన్ | 460 | 460 |
| సీబీ | - | - |



మార్కెట్‌కు వచ్చిన పట్టుగూళ్లు: 59.84 కిలోలు



# జిల్లా అభివృద్ధి లక్ష్యంగా పనిచేయాలి

**జిల్లా సమీక్ష కమిటీ సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి**



జిల్లా సమిక్షా కమిటీ సమావేశంలో పాల్గొన్న ఇన్‌చార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి, ఎమ్మెల్యేలు, జిల్లా కలెక్టర్, జెడ్పీ చైర్మన్లు

రాయచోటి : జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలని రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి, జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం సాయంత్రం అన్నమయ్య జిల్లా రాయచోటి కలెక్టరేట్‌లోని స్పందన హాలులో జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ ఆధ్వర్యంలో రాష్ట్ర వ్యవసాయ, సహకార, మార్కెటింగ్ శాఖ మంత్రి, /జిల్లా ఇంచార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి అధ్యక్షతన జిల్లా సమీక్షా కమిటీ సమావేశాన్ని నిర్వహించారు. సమావేశంలో శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త గడికోట శ్రీకాంత్‌రెడ్డి, ప్రభుత్వ విప్ కొరముట్ల శ్రీనివాసులు, కడప, చిత్తూరు జిల్లా పరిషత్ చైర్మన్లు ఆకేపాటి అమరనాథరెడ్డి, జి.శ్రీనివాసులు, ఎమ్మెల్యేలు పి.ద్వారకనాథరెడ్డి, చింతల రామచంద్రారెడ్డి, మేడా మల్లిఖార్జునరెడ్డి, జేసీ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్, డీఆర్‌ఓ సత్యనారాయణ, ఆర్డీఓలు రంగస్వామి, మురళి, భాస్కర్, వివిధ కార్పొరేషన్ చైర్మన్లు, అన్ని శాఖల జిల్లా స్థాయి అధికారులు పాల్గొన్నారు.తొలుత గత సమావేశంలో వివిధ అంశాల్లో పేర్కొన్న సమస్యలపై శాఖాపరంగా తీసుకొన్న చర్యలు, గృహ నిర్మాణం, నాడు-నేడు, ఐసీడీఎస్, వ్యవసాయ అనుబంధ శాఖలు, వైద్య ఆరోగ్యం, ఆరోగ్యశ్రీ, ఎడ్యుకేషన్, పంచాయతీరాజ్ గ్రామీణాబివృద్ధిలో భాగంగా జగనన్న స్వచ్ఛ సంకల్పం, ఎంజీఎస్‌ఆర్‌ఈజీఎస్, ఆర్‌డబ్ల్యూఎస్, ఇరిగేషన్, విద్యుత్తు, జగనన్న శాశ్వత భూహక్కు భూరక్షా పథకం, గ్రామ వార్డు సచివాలయాలు, సంక్షేమం, అభివృద్ధి తదితర అంశాలపై చర్చించారు.సమావేశంలో జిల్లా ఇన్‌చార్జి మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి మాట్లాడుతూ.. జిల్లా సమగ్ర అభివృద్ధి లక్ష్యంగా ప్రజాప్రతినిధులు, అధికారులు సమన్వయంతో పనిచేయాలన్నారు. రాష్ట్రాభివృద్ధికి ముఖ్యమంత్రి ప్రతిష్టాత్మకంగా చేపడుతున్న కార్యక్రమాలను జిల్లా స్థాయిలో సక్రమంగా, విజయవంతంగా అమలు చేయడం అధికారుల బాధ్యత అన్నారు. పథకాల అమలు విషయంలో అధికారులు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ప్రభుత్వ ఉద్యోగుల వద్దకు ప్రజలు వచ్చినపుడు ఎంత ఒత్తిడి ఉన్నా ఓపికగా సమాధానం చెప్పడం నేర్చుకోవాలన్నారు. అనంతరం వివిధ శాఖల అంశాలపై చర్చించి తగు సూచనలు జారీ చేశారు. ప్రస్తుత కమిటీ సమావేశంలో కొన్ని శాఖలలో సమన్వయం కొరవడినట్లు దృష్టికి వచ్చిందని, ఏవైనా లోపాలు ఉంటే సరిదిద్దుకొని ముందుకు వెళ్లాలన్నారు. శాఖాపరంగా పథకాల అమలులో ఇబ్బందులు ఉంటే సమస్యలను జిల్లా కలెక్టర్ లేదా సంబంధిత శాసనసభ్యుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కరించుకోవాలని మంత్రి పేర్కొన్నారు. ఈ సమావేశంలో వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

● జిల్లా సమీక్షా కమిటీ సమావేశం ప్రారంభంలో జిల్లా కలెక్టర గిరీషా పీఎస్ మాట్లాడుతూ నూతనంగా ఏర్పడిన అన్నమయ్య జిల్లాలో 2022 మే, నవంబరు మాసంలో రెండు సార్లు జిల్లా సమీక్షా కమిటీ సమావేశాలు జరిగాయని ప్రస్తుతం ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన మూడో జిల్లా సమీక్షా కమిటీ సమావేశం జరుగుతోందన్నారు. ఎంపీతో పాటు అందరూ శాసనసభ్యులు, ఎమ్మెల్సీలు, జిల్లా పరిషత్ చైర్మన్ అందరి సహకారంతో జిల్లా అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు పేర్కొన్నారు. డీఆర్‌సీ సమావేశంలో ప్రజా ప్రతినిధులు లేవనెత్తిన సమస్యలన్నీ త్వరగా పరిష్కరించాలని జిల్లా కలెక్టర్ గిరీషా పీఎస్ అధికారులను ఆదేశించారు. హౌసింగ్ పథకంలో పీఎస్‌పీఐ పెండింగ్ 8094 మందికి సంబంధించి రూ. 22.89 కోట్లు పెండింగ్ ఉందని, త్వరగా వచ్చేలా చూడాలని మంత్రిని కోరారు.

● జడ్పీ చైర్మన్ ఆకేపాటి అమరనాథరెడ్డి మాట్లాడుతూ అన్నమయ్య డ్యామ్ తెగి చాలా రోజులైందని, ఆ ప్రాంతంలో విద్యుత్ సమస్యలు అలాగే ఉన్నాయని, ఎందుకు నిర్లక్ష్యం చేస్తున్నారని ఆయన విద్యుత్ అధికారులను ప్రశ్నించారు. ప్రాథమిక వైద్య కేంద్రంలో పేదలు వైద్య సేవలకోసం వస్తుంటారని, రాత్రి సమయంలో సిబ్బంది ఉండడం లేదని, సిబ్బంది ఉండేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఇటీవల రాజంపేట మండలంలోని మందపల్లిలో పిడుగులు పడి పశువులు, గొర్రెలు చనిపోయాయని, ఆ రైతులకు పశుబీమా నష్టపరిహారం త్వరగా వచ్చేలా చర్యలు తీసుకోవాలన్నారు.

● ప్రభుత్వవిప్, శాసనసభ వ్యవహారాల సమన్వయకర్త, రాయచోటి ఎమ్మెల్యే గడికోట శ్రీకాంత్ రెడ్డి మాట్లాడుతూ రాయచోటి నియోజకవర్గ అభివృద్ధిలో ప్రణాళికాబద్ధంగా ముందుకు సాగుదామని అన్నారు. జగనన్న కాలనీలో త్వరగా పెండింగ్ లేకుండా విద్యుత్ సౌకర్యం కల్పించాలని ఏపీఎస్పీడీసీఎల్ ఎస్ఈని ఆదేశించారు. విద్యుత్ లైన్ల విస్తరణ, విద్యుత్ స్తంభాలు తరలించే పనులు నిమిత్తం రూ. 16 కోట్లు నిధులు మంజూరుకు ప్రభుత్వ పెద్దల దృష్టికి తీసుకుపోవాలని కలెక్టర్‌ను కోరారు. అన్నమయ్య జిల్లా కేంద్రం రాయచోటి 100 పడకల ఆసుపత్రి యుద్ధ ప్రాతిపదికన ఆగస్టు చివరిలోగా పూర్తి చేసేలా చర్యలు తీసుకోవాలన్నారు. రాయచోటి నియోజకవర్గంలో పాల వెల్లువ పథకంలో భాగంగా మరెన్నీ గ్రామాలలో రూట్లు పెంచాలని పశుసంవర్ధకశాఖ జేడీని ఆదేశించారు. లక్కిరెడ్డిపల్లి, సుండుపల్లి మండలాలలో తాగునీటి సమస్య నెలకొందని, ఆ గ్రామాలలో నీరు సరఫరా చేయాలన్నారు.

● చిత్తూరు జిల్లా జెడ్పీ చైర్మన్ జి శ్రీనివాసులు మాట్లాడుతూ అన్నమయ్య జిల్లాలోని 30 మండలాలలో జగనన్న పాల వెల్లువ పథకంలో భాగంగా పాల సేకరణ చేసేందుకు చర్యలు తీసుకోవాలని పశుసంవర్ధకశాఖ జేడీని ఆదేశించారు. ప్రతి పశువుకు జియోట్యాగ్ తప్పకుండా చేయాలన్నారు. తద్వారా పశువు చనిపోతే నష్టపరిహారం వస్తుందన్నారు.

● తంబళ్లపల్లి ఎమ్మెల్యే ద్వారకనాథరెడ్డి మాట్లాడుతూ తమ నియోజకవర్గంలో వైద్య సిబ్బంది ఖాళీలు ఉన్నాయని, త్వరగా ఆ స్థానాలను భర్తీ చేయాలని డీఎంహెచ్ఓకు సూచించారు. తంబళ్లపల్లె నియోజకవర్గంలో రైతులు అత్యధికంగా వేరుశనగ పంట సాగు చేస్తారని, రైతులు కావాలసినంత విత్తనాలను ఇండెంట్ పెట్టలేదని, అడిగిన తరువాతే పెట్టారని ఇంకోసారి అలా జరగకుండా చూసుకోవాలని జిల్లా అగ్రికల్చర్ అధికారులను ఆదేశించారు.

● పీలేరు ఎమ్మెల్యే చింతల రామచంద్రారెడ్డి మాట్లాడుతూ జగనన్న కాలనీలలో విద్యుత్ పనులు నత్తనడకన నడుస్తున్నాయని, చాలా మంది ప్రజలు ఇళ్లపైన విద్యుత్ లైన్‌లు ఉన్నాయని చెబుతున్నారని, ఆ లైన్‌లు షిఫ్టింగ్ చేయాలన్నారు. పాఠశాలలు, జన రద్దీ అధికంగా ఉన్న ప్రదేశంలో ట్రాన్సుఫార్మర్ ఉంటే ఫెన్సింగ్ వేయాలన్నారు.

● రాజంపేట ఎమ్మెల్యే మేడా మల్లికార్జున రెడ్డి మాట్లాడుతూ గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో వచ్చిన విద్యుత్ సమస్యలను త్వరగా పరిష్కరించాలన్నారు. రాజంపేట వందపడకల ఆసుపత్రిలో డాక్టర్స్ ఉండరని, డాక్టర్లు అందరూ కూడా విధులకు సక్రమంగా హాజరయ్యేలా చర్యలు తీసుకోవాలన్నారు. టెక్నీషియన్ పోస్టులు ఖాళీగా ఉన్నాయని త్వరగా భర్తీ చేయాలన్నారు. సుండుపల్లిలో ఉన్న ప్రాథమిక వైద్య కేంద్రంను 30 పడకల ఆసుపత్రిగా చర్యలు తీసుకోవాలన్నారు. సుండుపల్లి మండలంలో నీటి ఎద్దడి ఎక్కువగా ఉందని, పెండింగ్‌లో ఉన్న రోళ్లమడుగు స్కీమ్ వాటర్ సప్లై త్వరగా పరిష్కరించాలన్నారు.

### 27న జాబ్‌మేళా

రాజంపేట టౌన్: రాజంపేటలోని ప్రభుత్వ ఐటీఐలో ఈనెల 27న ఉదయం 10 గంటల నుంచి జాబ్‌మేళా నిర్వహించనున్నట్లు పారిశ్రామిక శిక్షణా సంస్థ జిల్లా కన్వీనర్, స్థానిక ప్రభుత్వ ఐటీఐ ప్రిన్సిపాల్ కే.శ్రీనివాసరావు శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. ఐటీఐలో ఏదేని ట్రేడ్‌లో ఉత్తీర్ణులైన వారు, అలాగే ఈనెలలో సీబీటీ పరీక్షకు హాజరైన అభ్యర్థులు జాబ్‌మేళాలో పాల్గొనేందుకు అర్హులన్నారు. మెఎస్సార్‌జిల్లాలో ప్రముఖ కంపెనీలైన శ్రీషిర్డిసాయి ఎలక్ట్రికల్స్ యాజమాన్యం ప్రతిభగల అభ్యర్థులకు తమ కంపెనీలో ఉద్యోగ అవకాశం కల్పిస్తుందని తెలిపారు. జాబ్‌మేళాలో పాల్గొనే అభ్యర్థులు బయోడేటాతో పాటు విద్యార్హతకు సంబంధించి ఒరిజినల్ సర్టిఫికెట్లు, జిరాక్స్ కాపీలు, ఆధార్, బ్యాంక్ అకౌంట్ ఒరిజినల్, జిరాక్స్ కాపీలు, నాలుగు పాస్‌పోర్టు సైజు ఫోటోలను తీసుకురావాలన్నారు. వివరాల కోసం 98484 53442 నంబర్‌లో సంప్రదించవచ్చని తెలిపారు.



### అర్హులందరికీ భూ పంపిణీ: మంత్రి



డ్రిప్, స్ప్రింకలర్ వాహనాలను జెండా ఊపి ప్రారంభిస్తున్న మంత్రి కాకాని గోవర్ధన్ రెడ్డి

రాయచోటి : పేదల సంక్షేమం కోసం రాష్ట్ర ప్రభుత్వం భూ పంపిణీ కార్యక్రమాన్ని చేపట్టిందని జిల్లా ఇన్‌చార్జి మంత్రి, వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి పేర్కొన్నారు. శనివారం కలెక్టర్ కార్యాలయంలో మినీ వీడియో కాన్ఫరెన్స్ హాల్లో జిల్లా ఇన్‌చార్జి మంత్రి అధ్యక్షతన జిల్లా స్థాయి అసైన్మెంట్ రివ్యూ కమిటీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ అన్నమయ్య జిల్లా వ్యాప్తంగా 2437 మంది లబ్ధిదారులకు 3279.94 ఎకరాల భూమిని పేదలకు పంపిణీ చేయనున్నట్లు చెప్పారు. రెండో విడత భూ పంపిణీకి సంబంధించి ఆగస్టు 15లోగా భూములను గుర్తించాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఎక్కడా లేని విధంగా రెవెన్యూ సమస్యల పరిష్కారానికి ప్రత్యేక చర్యలు తీసుకొని ఆంధ్రప్రదేశ్ దేశానికి ఆదర్శంగా నిలిచిందన్నారు. అనంతరం జిల్లా కలెక్టర్ గిరీషా పీస్ మాట్లాడుతూ ఎన్నో రోజుల తరువాత జిల్లాలో భూ పంపిణీ జరుగుతోందని చెప్పారు. సమస్యలు తలెత్తకుండా తగు జాగ్రత్తలు పాటించాలని తహసీల్దార్లకు సూచించామని చెప్పారు.

**డ్రిప్, స్ప్రింక్లర్లు అందజేత**

రాయచోటి: రాష్ట్ర వ్యవసాయశాఖ మంత్రి కాకాని గోవర్ధన్‌రెడ్డి చేతులు మీదుగా స్ప్రింక్లర్లు, డ్రిప్ పరికరాలను రైతులకు పంపిణీ చేశారు. శనివారం జిల్లా కలెక్టర్ ఆవరణంలో జిల్లా మైక్రో ఇరిగేషన్ అధికారి వెంకటేశ్వరరెడ్డి ఆధ్వర్యంలో ఏర్పాటు చేసిన 20 వాహనాల్లోని పరికరాల పనిముట్లను మంత్రి జెండా ఊపి ప్రారంభించారు. 2023-24 ఆర్థిక సంవత్సరానికిగాను జిల్లాలో 150 మంది రైతులకు 160 హెక్టార్లకు అవసరమైన రూ. 2.5 కోట్లు విలువజేసే సామాగ్రిని రైతులకు అందజేస్తున్నట్లు జిల్లా అధికారి మంత్రికి వివరించారు.

● మృతులు



మృతి చెందిన కమాల్‌బాషా, (ఫైల్)



కె.శేఖర్, (ఫైల్)



అమర్‌నాథ్‌రెడ్డి, (ఫైల్)


జి.శ్రీనివాసులు

# రక్తమోడిన రహదారి

ట్యాంకర్ డ్రైవర్ మద్యం మత్తు.. ఘోర రోడ్డు ప్రమాదానికి కారణమైంది. ఐదుగురిని బలి తీసుకుంది. ఇద్దరిని తీవ్రంగా, మరో 12 మందిని స్వల్పంగా గాయాల పాలు చేసింది. ఇలా ఎన్నో కుటుంబాల్లో విషాదం నింపింది. సిమెంటు ట్యాంకర్ ఆర్టీసీ బస్సును ఢీకొనడంతో ఈ సంఘటన చోటు చేసుకుంది. క్షతగాత్రుల హాహాకారాలు, బాధితుల ఆర్తనాదాలు మిన్నంటాయి.


ఓబులవారిపల్లె మండలం చిన్న ఓరంపాడు వద్ద ఆర్టీసీ బస్సును సిమెంటు ట్యాంకర్ ఢీకొన్న దృశ్యం

- ఆర్టీసీ బస్సును ఢీకొన్న సిమెంటు ట్యాంకర్
- ఐదుగురి మృతి ● ఇద్దరికి తీవ్ర గాయాలు
- 12 మందికి స్వల్ప గాయాలు
- మిన్నంటిన ఆర్తనాదాలు

**ఓబులవారిపల్లె :** కడప– రేణిగుంట జాతీయ రహదారి 716 శనివారం సాయంత్రం రక్తమోడింది. అన్నమయ్య జిల్లాలోని ఓబులవారిపల్లె మండలం చిన్న ఓరంపాడు వద్ద ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. ఆర్టీసీ బస్సును సిమెంటు ట్యాంకర్ వేగంగా వచ్చి ఢీకొంది. ఈ ప్రమాదంలో ఐదుగురు మృతి చెందగా, ఇద్దరికి తీవ్ర గాయాలయ్యాయి. మరో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. ట్యాంకర్ డ్రైవర్ మద్యం మత్తులో వాహనం నడపడమే ఇందుకు కారణంగా భావిస్తున్నారు. ప్రత్యక్ష సాక్షులు, పోలీసులు, స్థానికులు తెలిపిన మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. కడప ఐసీఎల్ నుంచి చెన్నైకి సిమెంటు పొడి లోడుతో వెళ్తున్న లారీ చిన్నఓరంపాడు దాబా హోటల్ వద్దకు రాగానే వేగంగా వచ్చి అదుపు తప్పింది. అదే సమయంలో తిరుపతి నుంచి కడపకు వెళ్తున్న ఆర్టీసీ బస్సును లారీ ఢీకొంది. ట్యాంకర్ డ్రైవర్ వేగంగా రోడ్డుకు అటు, ఇటు తిప్పుతూ వస్తుండాన్ని గమనించిన ఆర్టీసీ బస్సు డ్రైవర్ ప్రమాదాన్ని ముందే పసిగట్టారు. లారీ డ్రైవర్ మద్యం తాగి డ్రైవింగ్ చేస్తున్నారని గ్రహించి.. ప్రమాదం నుంచి బస్సును తప్పించేందుకు శతవిధాలా ప్రయత్నించి కుడి వైపునకు పూర్తిగా పక్కకు తిప్పాడు. ట్యాంకర్ లారీ బస్సు మధ్య భాగంలో కండక్టర్ సీటు వద్ద నుంచి, బస్సు వెనుక భాగంలో బలంగా ఢీకొంది. ఈ ప్రమాదంలో బస్సులో ప్రయాణిస్తున్న కడప సమీపంలోని కోగటం గ్రామానికి చెందిన బి.కమాల్‌బాషా (65), చిన్న ఓరంపాడు జ్ఞానంపల్లె దళితవాడకు చెందిన జి.శ్రీనివాసులు (60), రాజంపేట మండలం వెంకట రాజంపేటకు చెందిన కొమరావతి శేషహాద్రి కె.శేఖర్ (55) అక్కడికక్కడే మృతి చెందారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన చిట్వేలి గ్రామానికి చెందిన చెవ్వు అమర్‌నాథ్‌రెడ్డి (33) కడపకు తరలిస్తుండగా మార్గంమధ్యలో మృతి చెందాడు. నందలూరు మండలం ఆడపూరు గ్రామానికి చెందిన లక్ష్మయ్య(70)ను తిరుపతికి తరలిస్తుండగా మార్గంమధ్యలో మంగళం వద్ద చనిపోయాడు.

## గాయపడిన వారిని ఆస్పత్రులకు తరలింపు

తిరుపతిలోని శ్రీ చైతన్య బాలికల కళాశాలలో ఇంటర్ మొదటి సంవత్సరం చదువుతున్న నిఖిత, వెన్నెలకు తీవ్రంగా గాయాలు కావడంతో.. 108 వాహనంలో రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. వీరి పరిస్థితి విషమించడంతో తిరుపతికి తరలించారు. కళాశాలకు హోం సిక్ హాలీడేస్ ఇవ్వడంతో సిద్దవటం గ్రామానికి చెందిన నిఖిత, నందలూరు ఎర్రచెరువు గ్రామానికి చెందిన వెన్నెల తన స్నేహితులతో కలిసి బస్సులో తిరుపతి నుంచి బయలుదేరారు. మరో 12 మందికి స్వల్ప గాయాలయ్యాయి. తీవ్రంగా గాయపడిన కొందరిని రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రి నుంచి కడప రిమ్స్‌కు తరలించారు. చిన్న ఓరంపాడు దళితవాడకు చెందిన జి.శ్రీనివాసులు రాజంపేటకు వెళ్లేందుకు బస్సు ఎక్కాడు. పది నిమిషాల్లోపు ప్రమాదం జరిగి మృత్యువాత పడ్డాడు. కడప రూరల్ సబ్ రిజిస్ట్రార్‌గా పని చేస్తున్న శ్యామలాదేవి భర్త కె.శేఖర్ తిరుపతి నుంచి రాజంపేట మండలం వెంకట.. రాజంపేటకు వస్తుండగా మృతి చెందాడు.

● బాధితులకు పరామర్శ

రుయా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న వారిని ప్రభుత్వ విప్, శాసనసభ్యులు కొరముట్ల శ్రీనివాసులు, రాజంపేట శాసనసభ్యులు మేడా మల్లికార్జునరెడ్డి పరామర్శించారు. బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చారు.


ఆస్పత్రి వద్ద ఎమ్మెల్యేలు కొరముట్ల, మేడా

## స్తంభించిన ట్రాఫిక్

ట్యాంకర్ బస్సును ఢీకొని రోడ్డు మధ్యలో పడిపోవడంతో దాదాపు మూడు గంటలపాటు ట్రాఫిక్‌కు అంతరాయం కలిగింది. రైల్వేకోడూరు నుంచి పుల్లంపేట వరకు వాహనాలు నిలిచిపోయాయి. రాజంపేట డీఎస్పీ చైతన్య, రైల్వే కోడూరు సీఐ నరసింహులు, ఓబులవారిపల్లె ఎస్‌ఐ శ్రీకాంత్‌రెడ్డి, కడప ఆర్టీసీ రీజినల్ మేనేజర్ గోపాల్‌రెడ్డి, కడప, రాజంపేట డిపో మేనేజర్లు ఢిల్లీశ్వరావు, రమణయ్య, రాజంపేట, కడప ఆర్టీసీ అసిస్టెంట్ మేనేజర్లు మాధవీలత, కన్యాకుమారి ప్రమాద స్థలానికి చేరుకున్నారు. మృతదేహాలను పోస్టుమార్టం నిమిత్తం రాజంపేట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. రోడ్డుకు అడ్డంగా ఉన్న ట్యాంకర్, బస్సును భారీ క్రేన్ల సాయంతో పక్కకు తొలగించారు. ప్రమాద విషయం తెలియగానే మృతుల కుటుంబ సభ్యులు, బంధువులు, చుట్టుపక్కల గ్రామాల ప్రజలు పెద్ద సంఖ్యలో సంఘటనా స్థలానికి చేరుకున్నారు. బాధితుల రోదనలు మిన్నంటాయి. ప్రమాదంలో గాయపడిన ప్రయాణికుల హాహాకారాలతో సంఘటనా స్థలం దద్దరిల్లింది. చుట్టుపక్కల గ్రామాల యువత, ప్రజలు స్పందించి గాయపడిన వారిని అంబులెన్స్‌లు, 108 వాహనాల్లో తరలించేందుకు సహకారాన్ని అందించారు.


వాహనాలను క్రేన్ ద్వారా తొలగించి ట్రాఫిక్ క్లియర్ చేస్తున్న దృశ్యం


గుమికూడిన జనాలు


సంఘటన స్థలంలోనే మృతి చెందిన ముగ్గురు


నుజ్జునుజ్జు అయిన ఆర్టీసీ బస్సు



## రోడ్డు ప్రమాదంలో ఐదుగురి మృతి బాధాకరం

–ఆర్టీసీ చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి



**కడప కోటిరెడ్డిసర్కిల్ :** అన్నమయ్య జిల్లా చిన్నఓరంపాడు వద్ద శనివారం జరిగిన రోడ్డుప్రమాదంలో ఐదుగురు మృతిచెందడం బాధాకరమని ఏపీఎస్‌ఆర్టీసీ రాష్ట్ర చైర్మన్ అబ్బిరెడ్డి మల్లికార్జునరెడ్డి అన్నారు.తాను ఆదివారం ప్రమాదం జరిగిన ప్రదేశానికి వెళతానని, క్షతగాత్రులు చికిత్స పొందుతున్న ఆసుపత్రికి వెళ్లి పరిశీలిస్తానన్నారు. అలాగే మృతి చెందిన కుటుంబసభ్యులకు ప్రగాఢసానుభూతి తెలిపారు. వారిని ప్రభుత్వం అన్ని విధాలుగా ఆదుకుంటుందని చైర్మన్ పేర్కొన్నారు.

## పాముకాటుతో మహిళకు తీవ్ర అస్వస్థత

**మదనపల్లె :** పాము కాటుతో మహిళ తీవ్ర అస్వస్థత పాలైన సంఘటన శనివారం కురబలకోట మండలంలో జరిగింది. మండెంవారిపల్లెకు చెందిన ఎస్.రామకృష్ణ భార్య ఎస్.లక్ష్మీదేవి(42) పొలం వద్ద గడ్డికోస్తుండగా కాలిపై పాము కాటువేసింది. గమనించిన కుటుంబసభ్యులు హుటాహుటిన 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. చికిత్సల అనంతరం కోలుకుంటోంది.

## ఇద్దరు ఆత్మహత్యాయత్నం

**మదనపల్లె :** వేర్వేరు ప్రాంతాల్లో ఇద్దరు ఆత్మహత్యకు ప్రయత్నించి స్థానిక జిల్లా ఆస్పత్రిలో చికిత్స పొందుతున్నారు. పీటీఎం మండలం పెద్దకాలువకట్ట గ్రామానికి చెందిన కే.అరవింద్(19) డిగ్రీ మొదటి సంవత్సరం చదువుతున్నాడు. శనివారం తల్లి మందలించడంతో విషద్రావణం తాగి ఆత్మహత్యకు యత్నించాడు. గమనించిన కుటుంబ సభ్యులు బి.కొత్తకోట ప్రభుత్వ ఆస్పత్రికి తరలించగా, ప్రాథమిక చికిత్సల అనంతరం మెరుగైన వైద్యం కోసం 108 అంబులెన్స్‌లో మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించారు. అదే విధంగా మదనపల్లె మండలంలోని బసినికొండ పంచాయతీ డ్రైవర్స్ కాలనీకి చెందిన గుల్షాద్ కుమార్తె ముస్కాన్(22) కుటుంబ సమస్యలతో ఇంట్లో పురుగుల నివారణ మందు తాగి ఆత్మహత్యాయత్నానికి పాల్పడింది. గమనించిన కుటుంబ సభ్యులు స్థానిక జిల్లా ప్రభుత్వ ఆస్పత్రికి తరలించారు. తాలూకా పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

## సచివాలయ ఉద్యోగిపై దాడి కేసులో ఇద్దరు అరెస్ట్

**కడప అర్బన్ :** కడప నగరం చిన్నచౌక్ పోలీస్‌స్టేషన్ పరిధిలో అరవింద్‌నగర్ వార్డు సచివాలయంలో వార్డు ప్లానర్ ఉద్యోగిగా పని చేస్తున్న రామోహన్‌పై ఈ నెల 21న బి.బాలాంజనేయులు, ఎం.చంద్ర ఓబుల్‌రెడ్డి దాడి చేశారు. ఈ మేరకు బాధితుడు ఫిర్యాదు చేయడంతో పోలీసులు కేసు నమోదు చేశారు. శనివారం నిందితులిద్దరినీ ఎస్‌ఐ రవికుమార్ తమ సిబ్బందితో కలిసి అరెస్ట్ చేశారు.

## మహిళపై దౌర్జన్యం.. కేసు నమోదు

**కడప అర్బన్ :** కడప నగరంలోని టూటౌన్ పోలీస్‌స్టేషన్ పరిధిలో హనుమప్పవీధిలో నివాసం వుంటున్న విజయలక్ష్మి అదే వీధికి చెందిన పీర్‌బాషకు రూ. 5 లక్షలు అప్పుగా ఇచ్చింది. ఈక్రమంలో ఆ డబ్బులను అడుగగా శుక్రవారం రాత్రి వేళ మద్యం తాగి పీర్‌బాష ఆమె ఇంటికి వెళ్లి దౌర్జన్యానికి పాల్పడి, దుర్భాషలాడటంతో బాధితురాలు పోలీసులకు ఫిర్యాదు చేసింది. ఈ మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు కడప టూటౌన్ ఎస్‌ఐ జయరాముడు తెలియజేశారు.

## కుమార్తెను చంపిన తండ్రికి రిమాండ్

**లింగాల :** మండల పరిధి ఎగువపల్లె గ్రామంలో కుటుంబ కలహాలతో ఓ తండ్రి కన్న కుమార్తెను కడతేర్చారని సీఐ బాలమద్దిలేటి అన్నారు. ఆయన కథనం మేరకు వివరాలు ఇలా ఉన్నాయి. 2021 జనవరిలో ఎగువపల్లె గ్రామానికి చెందిన నారాయణరెడ్డి ఆయన కుమార్తె అయిన జయంతిని కడతేర్చి ఆత్మహత్య సృష్టించినట్లు పోస్టుమార్టం రిపోర్ట్‌లో తేలిందన్నారు. దీనిపై విచారణ నిర్వహించామన్నారు. శనివారం నారాయణరెడ్డిని అరెస్టు చేసి కోర్టుకు హాజరుపరచగా.. కడప సబ్‌జైలుకు రిమాండ్ చేయడం జరిగిందన్నారు.

## వేర్వేరు ఘటనల్లో ఇద్దరు మృతి

**బ్రహ్మంగారిమఠం :** మండలంలో శనివారం వేర్వేరు సంఘటనలలో ఇద్దరు మృతి చెందారు. చౌదరవారిపల్లె గ్రామానికి చెందిన పోలు సర్వేశ్వర్‌రెడ్డి(54) సగిలేటి వాగుకు ఇసుకకు వెళ్లి ఇసుక ర్యాపు మీద పడడంతో మృతి చెందాడు. సాగర్‌రోడ్డులోని తెలుగుగంగ కాలనీ సమీపంలో నివసిస్తున్న కొనగాని నరేష్( 35) ఇంట్లో విద్యుత్ షాక్‌తో మృతి చెందాడు. నరేష్‌కు భార్య, ముగ్గురు చిన్న పిల్లలు ఉన్నారు. తెలుగుగంగ కాలనీలో టిఫన్ సెంటర్ నిర్వహించే వాడు. శనివారం సాయంత్రం టిఫన్ సెంటర్ దగ్గర విద్యుత్ తీగను సరిచేస్తుండగా చేతికి కరెంట్ రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. బి.మఠం పోలీసులు కేసు నమోదు చేసుకొని సర్వేశ్వర్‌రెడ్డి, నరేష్‌ల మృతదేహాలను బద్వేల్ ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. పోస్టుమార్టం చేయించి మృత దేహాలను వారి కుటుంబ సభ్యులకు అప్పచెప్పారు.

## లోక్ అదాలత్‌లో 52 కేసుల పరిష్కారం

**కడప అర్బన్ :** జాతీయ న్యాయసేవాధికారసంస్థ, రాష్ట్ర న్యాయసేవాధికార సంస్థల ఆదేశానుసారంగా జిల్లా న్యాయసేవాధికారసంస్థ ఆధ్వర్యంలో శనివారం ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. మోటార్ వాహనాల ప్రమాదాలకు సంబంధించిన కేసులు (ఎంవీఓపీ), భూసేకరణ (ఎల్‌ఏఓపీ) కేసులకు ప్రత్యేక లోక్ అదాలత్ నిర్వహించారు. ఉమ్మడి జిల్లా వ్యాప్తంగా మూడు బెంచీలు ఏర్పాటు చేశారు. కడప, ప్రొద్దుటూరు, రాయచోటిలో ఏర్పాటు చేశారు. మొత్తం 52 కేసులు పరిష్కరించారు. రూ. 3,18,15,000 కక్షిదారులకు నష్టపరిహారంగా చెల్లించారు. ఈ లోక్ అదాలత్‌ను నిర్వహించిన న్యాయమూర్తులు ఇంతియాజ్ అహ్మద్, ఇతర న్యాయమూర్తులకు, న్యాయవాదులకు, సంబంధిత విభాగాల అధికారులకు జిల్లా ప్రధాన న్యాయమూర్తి పి.అన్నపూర్ణ, డీఎల్‌ఎస్‌ఏ సెక్రటరీ, జడ్జి ఎం.ప్రదీప్‌కుమార్‌లు కృతజ్ఞతలు తెలియజేశారు.

# గుండెపోటుతో ఫీల్డ్ అసిస్టెంట్ మృతి

**పెనగలూరు :** పెనగలూరు ఫీల్డ్ అసిస్టెంట్ నరసింహులు (48) గుండెపోటుతో శనివారం మృతి చెందాడు. వివరాల్లోకి వెళ్తే.. పెనగలూరు పంచాయతీలో ఉపాధి పనులు లేకపోవడంతో ఈటమాపురం పంచాయతీలోని అటవీ ప్రాంతంలో కూలీలతో కలిసి ఉపాధి పని చేయించేందుకు వెళ్లాడు. ఉపాధి కూలీలు పని చేస్తున్న సమయంలో టిఫిన్ తిన్న తరువాత నరసింహులకు ఒక్కసారిగా గుండెపోటు వచ్చింది. కూలీలతో మాట్లాడుతూ ఒక్కసారిగా కుప్పకూలిపోవడంతో హుటాహుటిన వారు ట్రాక్టర్‌లో పెనగలూరుకు తీసుకువచ్చారు. అక్కడ వైద్యునికి చూపించగా అప్పటికే మృతి చెందినట్లు తెలిపారు. కుటుంబ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు. రాష్ట్ర స్కిల్ డెవలప్‌మెంట్ చైర్మన్ అజయ్‌రెడ్డి, మండల ఉపాధ్యక్షులు విజయ్‌రెడ్డిలు ఫోన్ ద్వారా కుటుంబ సభ్యులను పరామర్శించారు. పెనగలూరు ఉపసర్పంచ్ చిన్నవెంగల్ రెడ్డి మృతునికి నివాళులు అర్పించగా వైఎస్సార్‌సీపీ సీనియర్ నాయకులు బిఎల్ నరసింహారెడ్డి కుటుంబ సభ్యులను ఫోన్ ద్వారా పరామర్శించారు. ఎంపీడీఓ వరప్రసాద్, ఏపీఓ మురళీ, ఫీల్డ్ అసిస్టెంట్ సిబ్బంది మృతదేహం వద్ద తమ సంతాపం వ్యక్తం చేశారు.


నరసింహులు మృతదేహం వద్ద విలపిస్తున్న కుటుంబ సభ్యులు

# వ్యక్తి అనుమానాస్పద మృతి


మంజునాథరెడ్డి (ఫైల్)

**బి.కొత్తకోట :** ఓ వ్యక్తి అనుమానాస్పద స్థితిలో మృతి చెందిన ఘటన బి.కొత్తకోట మండలంలోని గుట్టపాళ్యం సమీపంలో శనివారం జరిగింది. దీనికి సంబంధించి ఎస్‌ఐ రామమోహన్, గ్రామస్తుల కథనం మేరకు వివరాలు.. నాయనబావి పంచాయతీ గుట్టపాళ్యంకు చెందిన టి.మంజునాథరెడ్డి (38) పొలాల్లో డ్రిప్ పైపులను అమర్చే పనులు చేసుకొంటూ జీవించే వాడు. ఇతని భార్య కొన్నేళ్ల క్రితం అనారోగ్యంతో మృతి చెందింది. ఆయనకు ముగ్గురు కుమార్తెలు, ఒక కుమారుడు ఉన్నారు. కొంత కాలం క్రితం మంజునాథరెడ్డి తండ్రి వెంకటరమణారెడ్డి గుట్టపాళ్యం రోడ్డుపై ఉన్న 50 కుంటల భూమిని పత్రవారిపల్లెకు చెందిన గంగులప్పకు విక్రయించాడు. వెంకటరమణారెడ్డి చనిపోయాక ఆ భూమి తమ కుటుంబానికే చెందుతుందని మంజునాథరెడ్డి చెప్పడంతో.. గంగులప్ప మదనపల్లె కోర్టును ఆశ్రయించగా ఆయనకు అనుకూలంగా తీర్పు వచ్చింది. దీనితో భూమి దక్కదన్న మస్థాపంతో మంజునాథరెడ్డి గుట్టపాళ్యం సమీపంలోని చింతచెట్టుపైకి ఎక్కి తాడుతో ఉరి వేసుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. మంజునాథరెడ్డి ఆత్మహత్య చేసుకుంటానని గ్రామానికి చెందిన కొందరికి చెప్పడంతో వారు వారించి అతని వద్ద ఉన్న తాడును లాక్కున్నారు. తర్వాత మళ్లీ తాడుతో చెట్టుపైకి ఎక్కి ఆత్మహత్య చేసుకునట్టు భావిస్తున్నారు. కాగా మృతికి గంగులప్ప ఎస్సీ, ఎస్టీ కేసు పెడ్తాన్న బెదిరింపులు కారణమని ఆరోపిస్తూ మంజునాథరెడ్డి బామ్మర్ది మురళీ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదు మేరకు అనుమానాస్పద మృతిగా కేసు నమోదు చేసి విచారణ చేస్తున్నామని ఎస్‌ఐ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం మదనపల్లె జిల్లా ఆస్పత్రికి తరలించామని తెలిపారు.

# తల్లి,పిల్లల అదృశ్యంపై కేసు నమోదు


పి.శిల్ప(ఫైల్)

**మదనపల్లె :** ఓ మహిళ తన ఇద్దరు పిల్లలతో కలిసి ఇంటి నుంచి వెళ్లిపోయిన ఘటనపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వన్‌టౌన్ సీఐ మహబూబ్‌బాషా తెలిపారు. మండలంలోని కొత్త ఇండ్లు పంచాయతీ రంగారెడ్డికాలనీకి చెందిన పల్లెభానుప్రకాష్ భార్య పల్లె శిల్ప(35) ఈనెల 19న పట్టణంలోని మోతీనగర్ నెహ్రూ ట్యుటోరియల్స్ వద్దకు వెళ్లి ట్యూషన్‌లో ఉన్న ఇద్దరు పిల్లలు సాయితేజ(14), వరుణ్‌సాయి(12)లను తీసుకుని వెళ్లిపోయింది. పిల్లలను తీసుకువస్తానని చెప్పిన భార్య, పిల్లలు ఎంతసేపటికీ రాకపోవడంతో అనుమానం వచ్చిన భర్త భానుప్రకాష్ బంధువులు, తెలిసిన వారి ఇంటి వద్ద విచారణ చేశారు. అయినా ఫలితం లేకపోవడంతో భార్య, పిల్లల అదృశ్యంపై వన్‌టౌన్ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశాడు. సీఐ ఆదేశాల మేరకు హెడ్‌కానిస్టేబుల్ శివయ్య కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

# త్వరలో గంగోత్రి, మానస సరోవరంలో బోటింగ్

**బి.కొత్తకోట :** బి.కొత్తకోట మండలంలోని హార్సిలీ హిల్స్‌పై ఎంతో కాలంగా ఎదురుచూస్తున్న బోటింగ్‌ను ఏర్పాటు చేయబోతున్నామని జిల్లా అటవీ శాఖ అధికారి (రాజంపేట) పళణి వివేక్ చెప్పారు. శనివారం ఆయన మాట్లాడుతూ హార్సిలీహిల్స్‌పై అభివృద్ధి పనులు చేపట్టేందుకు అవసరమైన రూ.50 లక్షల నిధులు మంజూరు చేసేందుకు ఏపీఎండీసీ అంగీకారం తెలిపిందని పేర్కొన్నారు. దీనితో అభివృద్ధి పనులకు సంబంధించి సమగ్ర నివేదికను అందించనున్నట్టు చెప్పారు. అభివృద్ధిలో భాగంగా ఘాట్‌రోడ్డు పక్కనున్న గంగోత్రి చెరువు, కొండపైనున్న మానస సరోవరంలో పర్యాటకుల కోసం బోటింగ్ ప్రారంభిస్తామని తెలిపారు. పిల్లలకు రెండు పెడల్ బోట్లు, పెద్దలకు ఇంజిన్ బోట్లను ఏర్పాటు చేసి పర్యాటకులకు ఆహ్లాదం పంచనున్నట్టు చెప్పారు. నిరుపయోగంగా ఉన్న పది అటవీ గదులను ఆధునీకరించి అతిథి గృహాలుగా తీర్చిదిద్ది సందర్శకులకు అద్దెకు ఇస్తామన్నారు. మానస సరోవరంలో ఫ్లోటింగ్ రెస్టారెంట్ (తేలియాడే రెస్టారెంట్)ను ప్రారంభించేందుకు చర్యలు తీసుకుంటున్నామన్నారు. పర్యాటకులకు అందుబాటులో ఉంచుతూ అటవీశాఖ అతిథిగృహాలను బుక్ చేసుకునేందుకు అనువుగా ఆన్‌లైన్ విధానం అమలు చేస్తామన్నారు. ప్రకృతి అధ్యయన కేంద్రంలో ఎడ్యుకేషన్-నేచర్ క్లబ్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. రూ.15 లక్షలతో అభివృద్ధి, ఆధునీకరణ పనులు చేస్తామన్నారు. కొండపైన, ఘాట్‌రోడ్డులోని కాఫీతోటల నుంచి వచ్చే దిగుబడిని విక్రయించేందుకు సన్నాహాలు చేస్తున్నట్టు చెప్పారు. గింజలను కొనుగోలు చేస్తామని బెంగళూరుకు చెందిన అమృత, కాంటినెంటల్ కంపెనీలు ముందుకొచ్చి తమను సంప్రదించాయని తెలిపారు. సంస్థ ప్రతినిధులు గింజలను నేరుగానైనా లేక టెండర్ల నిర్వహణ ద్వారానైనా కొనుగోలుకు సిద్ధమని చెప్పారని అన్నారు. దీనిపై చర్యలు తీసుకుంటామన్నారు. హార్సిలీహిల్స్‌పై అటవీశాఖ ఆదాయ మార్గాలను పెంచుకునే దిశగా చర్యలు తీసుకుంటోందని వివరించారు.